ప్రజాశక్తి
సోమవారం 1 జులై, 2024
5
శ్రీకాకుళం

డివిఇఒగా తవిటినాయుడు

ప్రజాశక్తి - బూర్జ

డివిఇఒగా బూర్జ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శివ్వాల తవిటినాయుడు (పూర్తి అదనపు బాధ్యతలు) ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో ఇంటర్మీడియట్ విద్య ప్రాంతీయ పర్యవేక్షణ అధికారిగా, పార్వతీపురం మన్యం జిల్లా ఇంటర్మీడియట్ పరీక్షల ప్రత్యేక అధికారిగా విధులు నిర్వర్తించారు. ఇప్పటివరకు డివిఇఒగా పనిచేసిన కోట ప్రకాశరావు గత నెల 30న ఉద్యోగ విరమణ చేశారు. ఆయన స్థానంలో పూర్తి అదనపు బాధ్యతలను తవిటినాయుడుకు అప్పగిస్తూ ఇంటర్మీడియట్ ఆర్‌జెడి శారద ఆదేశాలు జారీ చేశారు.

మార్కెట్ కమిటీలు రద్దు

- ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం
- పర్సన్ ఇన్‌ఛార్జీలుగా అధికారుల నియామకం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాలను కొత్త ప్రభుత్వం రద్దు చేసింది. పర్సన్ ఇన్‌ఛార్జీలను నియమించాలని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఎడికి ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లాలో ఎఎంసి పాలకవర్గ సభ్యులు తమంతట తాముగానే రాజీనామా చేశారు. ఒకరిద్దరు రాజీనామాలు సమర్పించకపోయినా వాటినీ రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త కమిటీలు ఏర్పాటు చేసేంత వరకు పర్సన్ ఇన్‌ఛార్జీలుగా అధికారులను నియమించి పాలన కొనసాగనుంది.

జిల్లాలో శ్రీకాకుళం, ఎచ్చెర్ల, పొందూరు, ఆమదాలవలస, పాతపట్నం, హిరమండలం, జలుమూరు, నరసన్నపేట, కోటబొమ్మాళి, పలాస, కంచిలి, ఇచ్ఛాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. వైసిపి ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేల సిఫార్సు మేరకు పాలకవర్గాలను నియమించారు. ఏడాది పరిమిత కాలానికి కమిటీలను ఏర్పాటు చేస్తూ వచ్చారు. వాటి కాలపరిమితి పూర్తయిన తర్వాత పొడిగిస్తూ వచ్చారు. ఇలా రెండేళ్ల పాటు ఎఎంసి పాలకవర్గాలు మనుగడ సాగించాయి. తాజాగా కొత్త ప్రభుత్వం నాటి పాలకవర్గాలన్నింటినీ రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే జిల్లాలో అత్యధిక ఎఎంసిల్లో పాలకవర్గాలు రాజీనామా చేశాయి. పలాస, పొందూరులో మాత్రం రాజీనామాలు చేయకపోవడంతో ప్రభుత్వమే వాటిని రద్దు చేసింది. పాలకవర్గాల స్థానంలో ఇన్‌ఛార్జీలను నియమిస్తారు. సెలక్షన్ గ్రేడ్ అయితే మార్కెటింగ్ శాఖ జెడి పర్సన్ ఇన్‌ఛార్జీగా వ్యవహరిస్తారు. అంతకు తక్కువ ఆదాయం ఉండే ఎఎంసిలకు డీడీలు, ఎడిలను ఇన్‌ఛార్జీలుగా నియమించారు.

కొత్త పాలకవర్గాల కోసం చూపులు

కొత్త పాలకవర్గాల్లో చోటు దక్కించుకోవడానికి కూటమి శ్రేణులు ఎదురుచూస్తున్నాయి. ఎఎంసి చైర్మన్ కోసం ఆశావహుల సంఖ్య అధికంగానే ఉంది. ప్రధానంగా తెలుగుదేశం, బిజెపిల నుంచి చైర్మన్ పదవులను ఆశిస్తున్నారు. పొత్తులో భాగంగానే గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం, బిజెపిల నుంచి అభ్యర్థులు గెలుపొందారు. ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి బిజెపి, మిగిలిన ఏడు నియోజకవర్గాల్లో టిడిపి ఎమ్మెల్యేలు గెలుపొందారు. వ్యవసాయ మార్కెట్ కమిటీల నియామకంలోనూ కూటమి శ్రేణులకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది. మూడు పార్టీల నుంచి కమిటీల్లో చోటు లభించే అవకాశం ఉంటుంది. చైర్మన్ పదవి ఎవరిని వరిస్తుందనే విషయం ఆసక్తిగా మారింది. ఇప్పటికే కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల భర్తీ కోసం చకాచకా చర్యలు తీసుకుంటోంది. వైసిపి హయాంలో నియమించిన పాలకవర్గాలను రద్దు చేసింది. సహకార సంఘాల్లో ఇప్పటికే ఇన్‌ఛార్జీలను నియమించి, వైసిపి ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీలను రద్దు చేశారు. తాజాగా వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో ఇన్‌ఛార్జీలను నియమించాలని ప్రభుత్వం ఆదేశించింది. త్వరలోనే ఎఎంసి పాలకవర్గాలను భర్తీ చేయనున్నారు. కూటమి శ్రేణులు అందుకోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

నేడు వంశధార నీరు విడుదల

- సాగునీటికి ప్రభుత్వం ప్రాధాన్యత
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - నరసన్నపేట

హిరమండలంలోని గొట్టాబ్యారేజీలో వంశధార నీటిని సోమవారం విడుదల చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో కలిసి వంశధార అధికారులతో ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతపట్నం ఎమ్మెల్యే గోవిందరావు అధికారులతో కలిసి నీటిని విడుదల చేస్తారని చెప్పారు. ప్రస్తుతం బ్యారేజీలో రెండు వేల టిఎంసిల నీరుందని అధికారులకు మంత్రికి వివరించారు. కుడి, ఎడమ కాలువలకు ప్రాధాన్యతా క్రమంలో నీటిని విడుదల చేస్తున్నట్టు తెలిపారు. వంశధార కాలువలకు ఆనుకుని ఉన్న పిల్ల కాలువలను వెంటనే పరిశుభ్రం చేయాలని మంత్రి ఆదేశించారు. ఉపాధి హామీలో వీటిని పెట్టాలని సూచించారు. డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు మాట్లాడుతూ ఇప్పటికే 1386 పిల్ల కాలువలను గుర్తించామని, చాలావరకు పిల్ల కాలువలను పరిశుభ్రం చేశామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సాగునీటికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. ఈ ఖరీఫ్‌కు శివారు భూములకూ సాగునీరందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. సమావేశంలో కలెక్టర్ మనజీర్ జిలానీ, ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, గొండు శంకర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇకపై రైతు సేవా కేంద్రాలు

- రైతుభరోసా కేంద్రాల పేరు మార్పు
- జిల్లాలో వ్యవసాయ సలహా మండలి కమిటీలు రద్దు
- ఉత్తర్వులు జారీ చేసిన వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్

ప్రజాశక్తి - కవిటి

రైతుభరోసా కేంద్రాలు ఇకపై రైతు సేవా కేంద్రాలుగా మారనున్నాయి. పేరు మారుస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో, ఈమేరకు వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. గత వైసిపి ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల ద్వారా రైతులకు వ్యవసాయ సంబంధ సేవలు అందించింది. ఈ కేంద్రాలకు ప్రత్యేక భవనాలనూ ఏర్పాటు చేశారు. కొత్తగా కొలువుదీరిన కూటమి ప్రభుత్వం వ్యవసాయ శాఖ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా గ్రామ సచివాలయాల పరిధిలో రైతులకు అందుబాటులో ఉన్న రైతుభరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చింది. రైతుభరోసా కేంద్రాల వద్ద నవరత్నాలు, ఆర్‌బికె లోగోతో పాటు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఫొటోతో ఉన్న బోర్డులను తక్షణం తొలగించాలని ఉత్తర్వుల్లో ఆదేశించారు. జిల్లాలో మొత్తం 656 రైతుభరోసా కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 190 కేంద్రాల భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. 466 కేంద్రాలు పలు దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయి. రైతుల కోసం గత ప్రభుత్వం గన్నవరం కేంద్రంగా ఏర్పాటు చేసిన ఆర్‌బికె ఛానల్ పేరును 'పాడి పంటలు' ఛానల్‌గా కూటమి ప్రభుత్వం మార్పు చేసింది. వైఎస్సార్ రైతుభరోసా పేరిట వ్యవసాయంపై ముద్రిస్తున్న మాసపత్రికను 'పాడి పంటలు'గా మార్చారు.

జిల్లాలో వ్యవసాయ సలహా మండలి కమిటీలు రద్దు

జిల్లాలో వ్యవసాయ సలహా మండలి కమిటీలను రద్దు చేస్తూ వ్యవసాయశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రస్థాయి నుంచి జిల్లా, మండల, ఆర్‌బికెల స్థాయిలోని వ్యవసాయ సలహా మండలి కమిటీలన్నీ రద్దయ్యాయి. ప్రభుత్వ ఆదేశాలను తక్షణం అమలు చేయాలని సూచించారు. ఈమేరకు జిల్లా వ్యవసాయశాధికారి డివిజన్, మండల స్థాయి వ్యవసాయ అధికారులకు దిశానిర్దేశం చేశారు.

వ్యవసాయ కార్మికులకు...

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

వ్య.కా.స రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వ్యవసాయ కార్మికులను ఆదుకునేందుకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని వ్యవసాయ కార్మిక సంఘం కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కొన్ని పంటలను సాగు చేసినా కొనే వారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో జీడి ఉత్పత్తుల ధరలను స్థానిక వ్యాపారులే నిర్ణయించే పరిస్థితి ఉందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు.

గత వైసిపి ప్రభుత్వం సవరణ చేసిన అసైన్డ్ చట్టాన్ని రద్దు చేసి, పాత పద్ధతిలోనే కొనసాగించాలన్నారు. దళిత, పేదల భూములకు 9/77 చట్ట ప్రకారం ప్రభుత్వం రక్షణ కల్పించాలని కోరారు. కూలీలకు పని కల్పించాలన్నారు ఉపాధి హామీ చట్టాన్ని మరింత పకడ్బందీగా అమలు చేసేందుకు కేంద్రం నుంచి పెద్దఎత్తున నిధులు పెంచాలన్నారు. అడిగిన వారందరికీ పని కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో వలసల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. కొత్త ప్రభుత్వం ఉపాధి హామీ కూలీలు, వ్యవసాయ కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఆ సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిర్ల ప్రసాద్, గంగరాపు సింహాచలం, ఉపాధ్యక్షులు జి.ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

మాట్లాడుతున్న మహాలక్ష్మి

రాజకీయ వేధింపులు ఆపాలి

మధ్యాహ్న భోజన కార్మిక సంఘ గౌరవాధ్యక్షులు మహాలక్ష్మి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వ పాఠశాలల్లో సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు ఉద్యోగభద్రత కల్పించాలని, అలాగే రాజకీయ వేధింపులతో తొలగింపులు ఆపాలని మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘ జిల్లా గౌరవాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి, అధ్యక్ష, కార్యదర్శులు బి.ఉత్తర, కె.సుశీలలు డిమాండ్ చేశారు. నగరంలోని ఇందిరానగర్ కాలనీలో ఉన్న సిఐటియు కార్యాలయంలో సంఘ కోశాధికారి ఆర్.రాధ అధ్యక్షతన ఆదివారం జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేధింపులు ఆపకపోతే దశల వారీ ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. 23 ఏళ్లగా మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న వారిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులుగా గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకుండా పనిచేయించు కుంటున్నారని అన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా కార్మికుల బతుకుల్లో ఎలాంటి మార్పు రావడం లేదన్నారు. మార్కెట్లో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలన్నారు. వంట సమయంలో ప్రమాదం జరిగినా పట్టించుకునే నాథుడే కరువయ్యారయ్యారు.

ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. వంట గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని, కార్మికులకు ఇఎస్ఐ సౌకర్యం కల్పించడంతో నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని అన్నారు. మరోవైపు కార్మికుల పొట్టకొట్టి పథకాన్ని ప్రయివేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నం కొనసాగుతోందన్నారు. స్కూళ్లలో బోజన పథకం అమలుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకునే వారే లేరన్నారు. సమావేశంలో మండల నాయకులు టి.సీతమ్మ, ఎం.రాము, జి.దమయంతి వై.తులసి, కె.కౌసల్య, కె.మహేశ్వరి, ఎం.ఆదిలక్ష్మి, కె.ఉమ, మంగమ్మ, ఆదిలక్ష్మి, సి.ఉత్తర, బి.నాగరత్నం, ఎం.కుమారి, కళావతి, ప్రభావతి పాల్గొన్నారు.

మంత్రికి వినతుల వెల్లువ

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

గత కొనేళ్లుగా ఎన్నో సమస్యలతో ఇబ్బందులు పడుతున్న అంగన్వాడీలను గుర్తించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఆ సంఘ నాయకులు డి.సుధ కోరారు. ఈ మేరకు మండలంలోని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును ఆదివారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం అంగన్వాడీ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాలు అందించినా, నిరసన దీక్షలు చేపట్టినా పట్టించుకోకుండా తమకు మెమోలో జారీ చేసిందని అన్నారు. ఎంత నిరసన చేసిన గత పాలకులు పట్టించుకోలేదని మంత్రికి వివరించారు. అలాగే ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు, డ్రాయింగ్, క్రాఫ్ట్, ఆరోగ్య, విద్య బోధకులు కూడా మంత్రిని కలిసి తమ సమస్యలు వివరించారు. తమ ఉద్యోగాలను విద్యాశాఖలో విలీనం చేసి పాఠశాల పూర్తివేళల్లో పనిచేసేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఉద్యోగభద్రతతో పాటు కనీస వేతనం అమలు చేయాలని విన్నవించారు.

కోటబొమ్మాళి : మంత్రికి విన్నవించుకుంటున్న అంగన్వాడీలు

టెక్కలి: రాష్ట్ర వ్యాప్తంగా వివిధ శాఖల్లో ఉన్న మినిమం టైంస్కేల్ కంటిన్‌జెంట్‌లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి ఉద్యోగ విరమణ వయో పరిమితిని పెంచాలని ఆ సంఘ జిల్లా శాఖ అధ్యక్షులు బి.సురేష్, కార్యదర్శి కె.శ్రీనివాసరావులు కోరారు. ఈ మేరకు వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. 1993 నుంచి వివిధ శాఖల్లో విధులు నిర్వర్తిస్తున్న 2,968 మంది ఉద్యోగులు ఉన్నారని అన్నారు. అన్నిశాఖల ఉద్యోగులకు ఉద్యోగ విరమణ వయసుని పెంచారని, తమల్ని విడిచిపెట్టారని వివరించారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తమల్ని ఆదుకోవాలని వయోపరిమితిని 62 ఏళ్లకు పెంచాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో సురేష్, శ్రీనివాస రావు, మెండ వెంకటరావు, బెంజిమెన్ ఉన్నారు.

కోర్టు భవానలకు నిధులు మంజూరు చేయాలి

టెక్కలిలో నూతన కోర్టు, జడ్జి భవనాల నిర్మాణానికి నిధులు మమజూరు చేయాలని బార్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు మంత్రి అచ్చెన్నను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు దివ్వల వివేకానంద మాట్లాడుతూ కోర్టు భవన నిర్మాణానికి 94 సెంట్లు స్థలం ఉందని తెలిపారు. న్యాయవాదుల సంఘం కార్యదర్శి ఎస్.దివాకర్, న్యాయ వాదులు రాజేశ్వరరావు, పేడాడ బాబూరావు, పినకాన ఆజయ్‌కుమార్, పి.సాయిరాజ్, అంపోలు వైకుంఠరావు, పి.బలరాం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్

ఇంటి వద్దకే పింఛను

- నేటి నుంచి పంపిణీ
- లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేయనున్న సచివాలయ సిబ్బంది

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

సామాజిక భద్రత పింఛన్ల పంపిణీకి అధికారులు సర్వం సిద్ధం చేశారు. సోమవారం పండగ వాతావరణంలో ఎన్‌టిఆర్ భరోసా పేరుతో పంపిణీ చేయనున్నారు. సచివాలయ ఉద్యోగులతో పాటు ఇతర ఉద్యోగులు ఉదయం ఆరు గంటల నుంచే లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛను సొమ్మును అందజేశారు. జిల్లాలో మంది 3,19,702 మంది లబ్ధిదారులు ఉన్నారు. వారి కోసం ప్రభుత్వం రూ.212.07 కోట్ల నిధులు మంజూరు చేసింది. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, చర్మకారులు, హిజ్రాలు, హెచ్ఐవి బాధితులు, కళాకారులకు ఇస్తున్న రూ.మూడు వేల పింఛన్‌ను కూటమి ప్రభుత్వం రూ.నాలుగు వేలకు పెంచింది. వీరికి ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి పెంపును అమలు చేసి, ఈనెల ఒకటో తేదీన రూ.ఏడు వేలు (జూలై 1న ఇచ్చే రూ.నాలుగు వేలు, ఏప్రిల్ నుంచి మూడు నెలలకు రూ.వెయ్యి చొప్పున) అందజేయనుంది. వికలాంగుల పింఛను మొత్తాన్ని రూ.మూడు వేల నుంచి రూ.ఆరు వేలకు పెంచారు. కిడ్నీ, కాలేయం, గుండె మార్పిడి చేసుకున్న వారికి, డయాలసిస్ స్టేజ్‌కు ముందున్న కిడ్నీ వ్యాధిగ్రస్తులకు అందే రూ.ఐదు వేల మొత్తాన్ని రూ.పది వేలకు పెంచారు. కుష్టు కారణంగా బహుళ వైకల్యం సంభవించిన వారికి రూ.ఆరు వేలు పింఛను ఇస్తారు. పూర్తిస్థాయిలో అస్వస్థతకు గురైన వారికి, తీవ్ర అనారోగ్యంతో మంచాన పడిన వారికి, వీల్‌చైర్‌లో ఉన్న వారికి పెన్షన్‌ను రూ.15 వేలకు పెంచారు. ఈ మొత్తాన్ని నేడు అందజేయనున్నారు.

పక్కాగా పింఛన్ల పంపిణీ

ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి అందజేయాలని డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమార్ ఆదేశించారు. మండలంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో పింఛన్ల పంపిణీపై ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలి రోజే శత శాతం పింఛన్ల పంపిణీకి కృషి చేయాలన్నారు. సిబ్బంది అంకితభావంతో పనిచేసి జిల్లాను ప్రథమస్థానంలో నిలపాలన్నారు. కార్యాలయ ఆవరణలో పరిసరాలు పరిశుభ్రతపై ఎపిఎం, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం

ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి
(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ

'అల'జడి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని అక్కుపల్లి శివసాగర్ తీరం కోతకు గురవుతుంది. దీంతో 'అల'జడి ప్రారంభమైంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఆదివారం అలలు ఉవ్వెత్తున ఎగిసి పడుతున్నాయి. కెరటం ఒడ్డుకి బలంగా వచ్చి తాకడంతో ఇసుక తిన్నెలు కరిగి సముద్రంలోకి మళ్లుతున్నాయి. అక్కుపల్లి శివసాగర్ బీచ్‌కు పర్యాటకుల తాకిడి అధికంగా ఉంటుంది. ఇసుక తిన్నెలు తీరానికి సోయుగాలు తీసుకొస్తుంది. అయితే తీరం కోతకు గురి కావడంతో బోసిగా కనిపిస్తుంది. మరోవైపు పర్యాటకులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమయంలో పర్యాటకులు సముద్ర స్నానాలకు దిగితే ప్రమాదమని పోలీసులు హెచ్చరిస్తున్నారు. అక్కుపల్లి శివసాగర్ బీచ్‌కు వచ్చే పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని స్థానికుడు పురుషోత్తం సూచించారు. సముద్ర అలలు తాకిడి అధికంగా ఉందన్నారు. సముద్రం అల్లకల్లోలంగా ఉన్నప్పుడు ఇలాంటి మార్పులు చోటు చేసుకుంటాయని తెలిపారు.

కోతకు గురైన సముద్రం ఒడ్డు

అగ్రిగోల్డ్ బాధితుల వినతి

ఇచ్ఛాపురం: తమ సమస్యలు పరిష్కరించాలని అగ్రిగోల్డ్ బాధితులు ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను కోరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన అశోక్‌ను శాలువ కప్పి సత్కరించారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తామన్న హామీని అమలు చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో అగ్రిగోల్డ్ ఏజెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర మహిళా కార్యదర్శి పుక్కళ్ల అరేలమ్మ, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు కాళ్ల జైదేవ్, జె.గిరిబాబు, పి.వెంకటరావు, భాస్కరరావు, జయలక్ష్మి, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అశోక్‌కు సమస్యను వివరిస్తున్న అగ్రిగోల్డ్ బాధితులు

మదీనాబాబా మసీదును సందర్శించిన ఎమ్మెల్యే శంకర్

కళింగపట్నం అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నియోజక వర్గం పరిధిలో ఉన్న గార మండలం కళింగపట్నం మత్స్యకార ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఆదివారం కళింగ పట్నంలో ఉన్న మదీనా బాబా మసీదును ఆయన సందర్శించారు. ఆయనకు ముందుగా టిడిపి నాయకులు పొట్నూరు కృష్ణమూర్తి, తాళ్లూరి ప్రసాద్, ఎంపిటిసి శ్రీధర్ రెడ్డి, ఉన్నాజీరావులు స్వాగతం పలికారు. గ్రామస్తులతో కలిసి ఆయన మదీనాబాబా మసీదు, స్థానికంగా ఉన్న అమ్మవారి ఆలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో ప్రాచీన చరిత్ర ఉన్న కళింగపట్నం నిర్లక్ష్యానికి గురైందని, గ్రామంలో కనీస మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, సమస్యలను పరిష్కరించడానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

ఆందోళన చేస్తున్న ఆదివాసీలు

కార్పొరేట్ల దోపిడీని ప్రతిఘటిద్దాం

ప్రజాశక్తి- సోంపేట

'మన భూములు, మన అడవులు, మన సహజ వనరుల రక్షణ కోసం' ఆదివాసీ ప్రజలు ఐక్యంగా కదలాల్సిన చారిత్రక అవసరం ఏర్పడిందని అఖిల భారత ఆదివాసీ వేదిక (ఎబిఎవి) జిల్లా కమిటీ నాయకులు ఎస్.పున్నయ్య పిలుపునిచ్చారు. మందస మండలం ఆదివాసీ ప్రాంతంలోని కొండలోగాంలోని సవర చిలకమ్మ స్మారక స్థూపం ఆవరణలో ఆదివారం సంస్మరణ సభ నిర్వహించారు. అనంతరం ఆందోళన చేపట్టారు. 168 వసంతాల ఆదివాసీల చారిత్రాత్మక తిరుగుబాటును గుర్తుచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 168 ఏళ్ల క్రితం పోరాటంలో అమరులైన ఆదివాసీ బిడ్డలు సిద్ధూ కాను నాయకత్వంలో అనేక మంది ఆదివాసీ అమరుల త్యాగాలని స్మరించుకోవాలన్నారు. ఆదివాసీ సామాజిక, ఆర్థిక, సంస్కృతిపై జరుగుతున్న దాడులను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, ప్రగతిశీల యువజన సంఘం జిల్లా కన్వీనర్ సార జగన్ మాట్లాడుతూ హిందుత్వవాద ఆర్ఎస్ఎస్, దాని అనుబంధ సంస్థలు హిందూ రాష్ట్రం పేరుతో మనల్ని మత ప్రాతిపదిక విభజించి హిందూకీకరణ చేయటానికి ప్రయత్నిస్తున్నాయని అన్నారు. ఇటీవల కాలంలో మణిపూర్‌లో ఆదివాసీ వ్యతిరేక హింసాత్మక రాజకీయాలను చూశామని అన్నారు. కార్యక్రమంలో ఎన్.రాజారావు, ఎన్.లకర్ర, ఎస్.మోహనరావు, ఎస్.వసుదేవరావు, అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా కమిటీ నాయకులు గొరకల బాలకృష్ణ పాల్గొన్నారు.

నృత్యంలో ఓ సన్నివేశం

'కనకదుర్గ' సన్నిధిలో నాట్య ప్రదర్శన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

విజయవాడ దుర్గామల్లేశ్వర దేవస్థానం కనకదుర్గ అమ్మవారి ఆలయంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యాన ధర్మపథం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇచ్ఛాపురానికి చెందిన శ్రీ స్వేచ్ఛా నృత్య తరంగణి కూచిపూడి భరతనాట్యం జానపద నాట్య శిక్షణ ఆలయం కళాకారులచే ఆదివారం నృత్య ప్రదర్శన చేశారు. ఈ నృత్యం అందరినీ ఆకట్టుకుంది. కూచిపూడి నాట్యం ప్రదర్శనలో నాట్య కళాకారులు, నాట్య గురువు మంగి దివ్య, కె.కుమార్, డి.శిరీష, బి.భవాని, పి.వర్షిత, టి.ఉషారాణి, పి.సత్యశ్రీ, ఎ.కృతజ్ఞ, బి.నయణి, డి.ఉపాసన, డి.జోషిక, ఎం.వర్షిని, టి.ఆశ, పి.శరణ్య, డి.జాహ్నవి, ఇ.సంజన, ఎ.తనుజ, బి.యస్వితలు పాల్గొన్నారు. నాట్య గురు మంగి దివ్య, అధ్యక్షులు గోవిందరావు, కోశాధికారి మంగితాలమ్మలకు దుర్గామల్లేశ్వర స్వామి ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎస్.రామారావు, ఆలయ ప్రధాన పూజారి అమ్మవారి చిత్రపటంతో సత్కరించి అభినందించారు. నవదుర్గ తృత్యరూపకాన్ని కార్యనిర్వహణ అధికారి రెండోసారి పాట ప్రదర్శన చేయించి... ప్రత్యేకంగా 30 నిమిషాల పాటు ఈ పాటను తిలకించారు. ఇచ్ఛాపురం నుంచి వచ్చిన కళాకారులు ఇంత అద్భుత ప్రదర్శన చేశారని విద్యార్థులకు ప్రశంసల జల్లు కురిపించారు.

పైసలు ఇస్తేనే హాజరు

- శానిటరీ అసిస్టెంట్ వేధింపులు
- భరించలేకపోతున్నామంటున్న కార్మికులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘంలోని శానిటరీ అసిస్టెంట్ కల్యాణ్ శేఖర్ వేధింపులను భరించలేక పోతున్నామని పారిశుధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే పురపాలక సంఘం పరిధిలో 62 మంది పారిశుధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు వేకువజామున 5 గంటలకు మోణింగి వారి వీధిలో నున్న మస్టర్ పాయింట్ వద్దకు వెళ్లి హాజరు వేసుకొని అక్కడి నుంచి వారికి కేటాయించిన ప్రాంతానికి వెళ్లి విధులు నిర్వహిస్తూ ఉంటారు. అయితే శానిటరీ ఇన్‌స్పెక్టర్ హాజరు వేయాల్సి ఉన్నప్పటికీ ఆయన విధులకు సక్రమంగా హాజరు కాకపోవడంతో శానిటరీ అసిస్టెంట్ కళ్యాణ్ శేఖర్ కనుసన్నలలోనే అంతా జరుగుతుండడంతో గడచిన కొన్నేళ్లుగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని పారిశుధ్య కార్మికులు వాపోతున్నారు. శానిటరీ అసిస్టెంట్ కళ్యాణ్ శేఖర్ పలాసలో విధులు నిర్వహిస్తూ డిప్యూటేషన్‌పై ఆమదాలవలస వచ్చి విధులు నిర్వహిస్తున్నారు. పారిశుధ్య కార్మికులు విధులకు రావడానికి ఐదు నిమిషాలు ఆలస్యమైనా ఆ రోజు హాజరు పట్టికలో ఆబ్సెంట్ నమోదు చేస్తున్నారని అక్కడ నుంచి రెండు, మూడు రోజులు విధులకు హాజరైనప్పటికీ తీసుకోవడం లేదని కార్మికులు వాపోతున్నారు. నెలాఖరులో కార్మికులను శానిటరీ అసిస్టెంట్ పిలిపించి జీతం సక్రమంగా రావాలంటే ఒక్కో పని దినానికి రూ.300 తనకు ముట్ట చెప్పితే విధులకు సక్రమంగా హాజరైనట్లు హాజరును వేసి అధికారులకు అందజేస్తానని, కోతలు లేకుండా పూర్తిస్థాయిలో జీతాలు అందుతాయని చెబుతుండడంతో ఆయన అడిగిన మొత్తాన్ని ముట్ట చెబుతున్నామని పారిశుధ్య కార్మికులు చెబుతున్నారు. అలాగే కార్మికులకు సెలవు కావాలన్నా ఆయన అడిగిన పైకం ఇస్తేనే సెలవు మంజూరవుతుందని, లేకుంటే సెలవులు దొరక్క ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, దీంతో ఆయన అడిగిన మొత్తం ఇవ్వక తప్పడం లేదని కార్మికులు వాపోతున్నారు. ఈ సంఘటనలపై పలుమార్లు గతంలో స్పీకర్, మున్సిపల్ ఉన్నతాధికారులకు తెలియజేశామని అప్పట్లో ఈయన డిప్యూటేషన్ రద్దుచేసి పలాస తిప్పి పంపాలని మున్సిపల్ అధికారులకు స్పీకర్ ఆదేశించినప్పటికీ కొంతమంది వైసిపి నాయకులతో శానిటరీ అసిస్టెంట్ మంతనాలు చేసి మళ్లీ ఇక్కడే ఉండిపోయారని కార్మికులు గుర్తు చేసుకుంటున్నారు. టిడిపి అధికారంలోకి వచ్చాక మున్సిపాలిటీకి చెందిన ఓ టిడిపి ప్రధాన నేతను మచ్చిక చేసుకుని ప్రతిరోజు ఆయన దగ్గరికి వెళ్లి లేనిపోని విషయాలు చెబుతూ మళ్లీ ఇక్కడే కొనసాగేందుకు పావులు కదుపుతున్నారని పలువురు చెబుతున్నారు. శానిటరీ అసిస్టెంట్ స్వస్థలం శ్రీకాకుళం కావడంతో ఆమదాలవలస దగ్గర్లోనే ఉండడం, అధిక మొత్తం ఆదాయం సమకూరడంతో ఆయన ఇక్కడ నుంచి వెళ్లడానికి ఇష్టపడడం లేదని మున్సిపల్ ఉద్యోగులే చెబుతున్నారు. మార్కెట్లో ఉన్న అరటి పళ్లు, టిఫిన్, పలు రకాల దుకాణాల నుంచి నెలవారి మామూళ్లు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. తొందరలోనే సిఐటియు నాయకులతో కలిసి ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను తెలియజేస్తామని పారిశుధ్య కార్మికులు చెబుతున్నారు.

పురపాలక సంఘ కార్యాలయం

నేడు ఎమ్మెల్యే రాక

లావేరు: లావేరు మండల కేంద్రానికి సోమవారం ఎమ్మెల్యే ఈశ్వరరావు రానున్నారని టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్ తెలిపారు. ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ సందర్భంగా జులై 1 పింఛనుదారులకు పెంచిన పింఛన్ రూ.7 వేలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. లావేరు, తాళ్లవలస పంచాయతీ సుబ్రద్రపురం గ్రామాల్లో లబ్ధిదారులకు పింఛన్లు ఎమ్మెల్యే చేతులమీదగా అందజేయడం జరుగుతుందన్నారు. నాయకులు, కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అరసవల్లిని సందర్శించిన మనో

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని ఆదివారం సినీ నేపథ్య గాయకుడు నాగూర్ బాబు (మనో) కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. వారికి ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతించారు. ఆలయంలో స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంతరం అనివేటి మండపంలో ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ శేష వస్త్రాలను కప్పి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

ఆదాయం రూ.4.92లక్షలు

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి సాధారణ రద్దీ కొనసాగింది. దీంతో ఆదివారం ఒక్కరోజు రూ.4.92 లక్షల మేర ఆదాయం సమకూరినట్టు ఇఒ చంద్రశేఖర్ తెలిపారు. టికెట్లు విక్రయాల ద్వారా రూ.2,14,700, విరాళాల ద్వారా రూ.63,412, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2,14,700 ఆదాయం సమకూరినట్టు ఆయన తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

కవిటి: పంచాయతీలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు నెలవంక సర్పంచ్ ప్రతినిధి కుమార్ మోహన్‌రెడ్డి అన్నారు. పంచాయతీ నిధులతో దుర్గమ్మపుట్టుగలో మంచినీటి బోరుకు ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి మాజీ సభ్యులు హరికృష్ణ, బిసాయి, దుక్క దేవదాస్‌రెడ్డి, దుర్గాసి వెంకటరావు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు

పొందూరు: పట్టణానికి సంబంధించి తాగునీటి సరఫరా పైపులైన్‌కు ఆదివారం టిడిపి పట్టణ అధ్యక్షుడు అనకాపల్లి శ్రీరంగ నాయకులు (చిన్న రంగా) ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టారు. గత కొద్దిరోజులుగా తాగునీటి సరఫరా పైపులైన్ పాడైపోవడంతో సరిపడా తాగునీరు సరఫరా కాకపోవడంతో పట్టణ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు లైదాం సమీపంలోని రెల్లిగడ్డలో ఈ తాగునీటి పైపులైన్‌లకు మరమ్మతులను చేపట్టామని ఆయన తెలిపారు. ఈయనతో పాటు టిడిపి నాయకులు కాలెపు శ్రీనివాసరావు, అనకాపల్లి భవాని శంకర్, జరజాపు నాగరాజు ఉన్నారు.

మరమ్మతు పనులను పరిశీలిస్తున్న రంగనాయకులు

గత ఐదేళ్లలో రాష్ట్రంలో అభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి- బూర్జ

ఉత్తరాంధ్ర ప్రాంతంలో గడచిన ఐదేళ్లలో లక్షల కోట్ల ప్రజాధనాన్ని మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డితో పాటు ఆయన మంత్రులు దుర్వినియోగం చేశారని ఎమ్మెల్యే కూన రవికుమార్ విమర్శించారు ఆదివారం బూర్జ హైస్కూల్ ఆవరణలో ఎంపిడిఒ రవీంద్రబాబు పదవి విరమణ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర ప్రజల సొమ్ముతో ప్యాలస్‌లు ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. గడిచిన ఐదేళ్లు రాష్ట్రంలో అభివృద్ధి శూన్య మన్నారు. రోడ్లు కూడా వేసుకోలేకపోయారన్నారు. నదుల అనుసంధానం, వంశధార, ఆఫ్‌షోర్ ప్రాజెక్టులను పూర్తి చేయలేక పోయారన్నారు. త్వరలో ఆమదాలవలస - శ్రీకాకుళం ప్రధాన రహదారి రోడ్డు వేస్తామన్నారు. నాగావళి, వంశధార కాలువల అనుసంధానం చేస్తామన్నారు. వైసిపి నియంతృత్వపు పోకడలు, అవినీతి, ప్రజల స్వేచ్ఛను హరించడం వలనే ప్రజలు ఆయనకు గుణపాఠం చెప్పారన్నారు. సిఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నారన్నారు. అనంతరం పదవి విరమణ చేసిన ఎంపిడిఒ రవీంద్రబాబును ఘనంగా సన్మానించారు. రవీంద్రబాబు మండలంలో మంచి సేవలు అందించారని ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు, మాజీ జెడ్‌పిటిసి ఆనెపు రామకృష్ణ నాయుడు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎంపిడిఒ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రవికుమార్

శ్రీధర్‌ను సన్మానం చేస్తున్న కూటమి నాయకులు

పవన్ కృషితోనే కూటమి ఏర్పాటు

పలాస: రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూటమి ఏర్పాటుకు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసే కృషి ఎనలేనిదని జనసేన నాయకులు డాక్టర్ దానేటి శ్రీధర్ అన్నారు. పలాస రైల్వే ఇన్స్టిట్యూట్‌లో జనసేన మండల నాయకులు అట్టాడ వాసు అధ్యక్షతన ఆదివారం విజయోత్సవ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి బలంతో కేంద్ర పౌర విమాయనా శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు 3.50 లక్షలు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష 40 వేలు పైబడి మెజారిటీతో గెలుపొందారన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో మంత్రులుగా ఉండడంతో జిల్లా అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. రానున్న పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో కూటమి ఐక్యమంగా విజయం సాధించేందుకు ఇప్పటి నుంచే కూటమి నాయకులు కలిసి కట్టుగా పనిచేస్తూ ప్రజలకు సేవలు అందించాలన్నారు. ఎమ్మెల్యే గౌతు శిరీష బాధ్యతగా భావిస్తూ ప్రజలకు సేవలు అందించేందుకు గ్రామాల్లో పర్యటిస్తున్నారని తెలిపారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో పంట భూములకు సాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నారన్నారు. అనంతరం ఆయనకు కూటమి నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బి.నాగరాజు, డొక్కరి శంకర్, టంకాల రవి శంకర్‌గుప్తా, సప్ప నవీన్, జనసేన నాయకులు దేవ, అశోక్, రాము, కేదార్, మోహన్, కార్తిక్, చిన్ని, చైతన్య, పృథ్వీ, సంతోష్, గోపాలరావు, నీలకంఠం, సందీప్, గీతా గణపతి, ఈశ్వరరావు, తేజ, రాజు, మిన్నారావు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షునిగా నాగార్జున

పలాస: పలాస-కాశీబుగ్గ ప్రెస్‌క్లబ్ (ఎలక్ట్రానిక్ మీడియా) అధ్యక్షునిగా చెరుకుపల్లి నాగార్జున, కార్యదర్శిగా సంపతిరావు జయంత్, కోశాధికారిగా జగన్‌లు ఎన్నికయ్యారు. కాశీబుగ్గ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్ష స్థానానికి పోటీ చేసిన కింజరాపు కృష్ణారావుపై నాగార్జున గెలుపొందారు. అలాగే కార్యదర్శిగా పోటీ చేసిన గుంట సుభాష్ చంద్రబోస్‌పై జయంత్ విజయం సాధించారు. కోశాధికారిగా జగన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలోనూ నాగార్జున అధ్యక్షునిగా వ్యవహరించారు. ఎన్నికల పరిశీలకులు రాజేంద్రప్రసాద్ సురో, గంగు శ్రీను, కుందు కృష్ణ, కొంచాడ రవి శంకర్, రత్నాల రమేష్, సిరిపురం సంతోష్, ఎ.కిశోర్, మోస కుమారస్వామి, తులసీరావులు వ్యవహరించారు. 45 మంది సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు డి.మహరణ, జగదీష్, అంది రాము, హరి, రమణ అభినందించారు.

బురదతో అవస్థలు

కొత్తూరు : స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణ బురదమయమైంది. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు చేరడం, వాహనాలు తిరగడంతో ఆవరణ అంతా బురదమయమైంది. ఆర్‌టిసి కాంప్లెక్స్ నాలుగు రోడ్ల కూడలి వద్ద ఉండడంలో పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ, భామిని, శ్రీకాకుళం, నివగాం వెళ్లేందుకు ప్రయాణికులు వస్తూ.. వెళ్తూ.. ఉంటారు. ఈ బురదతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. లగేజీతో వచ్చిన ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతం. కాంప్లెక్స్ లోతుగా ఉందని ఉద్దేశంతో ఇటీవల మట్టి వేశారు. భారీగా వర్షాలు కురవడంతో ఆ మట్టి చెల్లాచెదారు కావడంతో ఈ సమస్యకు దారితీసింది. ఆర్‌టిసి అధికారులు స్పందించి తారు రోడ్డు వేయాలని కోరుతున్నారు.

బురదమయమైన కాంప్లెక్స్ ఆవరణ

తాతారావు మృతదేహం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మరొకరికి గాయాలు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలోని ఎత్తురాళ్లపాడు వద్ద జాతీయ రహదారి సమీపంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో టెక్కలి మండలం రావివలస పంచాయతీ దామోదపురానికి చెందిన పురట తాతారావు (42) అక్కడకక్కడే మృతి చెందగా, కోటబొమ్మాళి మండలం దుప్పిలపాడుకు చెందిన యండ నర్సింహమూర్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు తాతారావు, క్షతగాత్రుడు నర్సింహమూర్తిలు ఐతం ఇంజినీరింగ్ కళాశాలలో పనిచేస్తున్నారు. నరసన్నపేట నుంచి ద్విచక్రవాహనంపై టెక్కలి వెళు_న్నారు. ఎత్తురాళ్లపాడు వద్ద వెనుక నుంచి వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరూ పక్కకు పడి పోయారు. అదే సమయంలో గుర్తు తెలియన మరో వాహనం అతివేగంగా వచ్చి తాతారావు పైనుంచి, నర్సింహమూర్తి వెడమచేతిపై నుంచి వెళ్లి పోయింది. దీంతో తాతారావు ప్రమాదస్థలంలోనే మృతి చెందారు. నర్సింహమూర్తి చేయి నుజ్జునుజ్జు అయ్యింది. దీంతో స్థానికులు క్షతగాత్రుడిని శ్రీకాకుళంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహానికి శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కోటబొమ్మాళి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య స్వాతి, కుమారుడు రాకేష్, తల్లిదండ్రులు శీనమ్మలు, చిన్నవాడు ఉన్నారు. తాతారావువు వచ్చిన జీతంతోనే కుటుంబం జీవనం సాగించారని, ఆయన మృతితో కుటుంబం రోడ్డున పడిందని బంధువులు రోదిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాముకాటుతో మహిళ మృతి

టెక్కలి రూరల్ : మండలంలోని తొలిసూరుపల్లికి చెందిన గూన సరోజిని (25) అనే వికలాంగురాలు పాముకాటుకు గురై ఆదివారం వేకువ జామున మృతి చెందింది. శనివారం అర్ధరాత్రి సమయంలో తన ఇంట్లో నిద్రిస్తుండగా పాము కాటు వేసింది. వెంటనే కేకలు వేయడంతో స్థానికులు హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి జిల్లా సర్వజనాస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. ఎస్ఐ-2 వెంకటేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

ఓంకార్‌కు నివాళి

టెక్కలి రూరల్: ఓంకార్ ఉపాధ్యాయులుగా పనిచేస్తూ ప్రజా నాట్యమండలి కళాకారులుగా, యుటిఎఫ్ నాయకులుగా ఉంటూ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతికి సంతాపం తెలియజేస్తూ... ఓంకార్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆంధ్రా ప్రజానాట్య మండలి, యుటిఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు ఓంకార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి జిల్లా కన్వీనర్ తమ్మినేని వైకుంఠరావు, యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు కె.బాలయ్య, పాలవలస ధర్మారావు, విజయ్‌కుమార్, సిఐటియు నాయకులు నంబూరు షణ్ముఖరావు, ప్రజా నాట్యమండలి కళాకారులు బగాది వాసుదేవరావు, సిహెచ్.శ్రీనివాసరావు, ఎస్ఎఫ్ఐ నాయకులు దురా ప్రసాదరావు, మల్లేశ్వరరావు, విశ్రాంత ఉపాధ్యాయులు స్టాలిన్, దుర్గారావు పాల్గొన్నారు.

కృష్ణారెడ్డికి మహానంది పురస్కారం

ఇచ్ఛాపురం: తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యాన మాజీ ప్రధాని, భారతరత్న పి.వి.నరసింహారావు జయంతి-2024ని పురస్కరిం చుకొని మహానంది జాతీయ పురస్కారాలు అవార్డులను ప్రకటించారు. ఈ మేరకు ఇచ్ఛాపురానికి శాస్త్రీయ సంగీత కళా రంగంలో చేస్తున్న విశిష్టమైన సేవలను ఆశీ కృష్ణారెడ్డికి తెలుగు వెలుగు మహానంది జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. వివిధ హోదాల్లో సామాజిక సాంఘిక శాస్త్రీయ సంగీతం, విద్య సేవా కార్యక్రమాలతో పాటు తెలుగు వెలుగు భాషాభివృద్ధికి కృషి చేశారు. దీనికి గాను మహానంది అవార్డుకు ఎంపికయ్యారు. ఈ అవార్డును తెలంగాణ రాష్ట్రం కరీంనగర్‌లో ఆదివారం మహానంది అవార్డును ప్రదానం చేశారు. ముఖ్య అతిథులు విశ్వకళా విరాట్ బ్రహ్మ డాక్టర్ వంగాల శాంతి కృష్ణ ఆచార్య, హాస్యనటులు ఆర్.ఎస్.నంద, తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ చైర్మన్ పోలోజు రాజ్ కుమార్ చేతుల మీదుగా అందుకున్నారు.

గుంతల పూడ్చివేత

సరుబుజ్జిలి: అలికాం - బత్తిలి రహదారిపై భారీ గుంతలు ఏర్పడి మూడేళ్లు నరకం అనుభవిస్తున్న వాహనదారులకు రోడ్లు, భవనాల శాఖ అధికారులు కొంతమేర ఉపశమనం కలిగించారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆదేశాలతో ఎట్టకేలకు స్పందించిన అధికారులు ఆదివారం సరుబుజ్జిలి మండల కేంద్రం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ఉన్న సుమారు కిలోమీటర్ దూరంలో ఉన్న భారీ గుంతలను కొండ గ్రావెల్ మెటల్‌తో ప్రొక్లెయిన్‌తో పూడ్చివేత పనులు చేపట్టారు.

క్రీడలకు సహకారం అందిస్తా

సరుబుజ్జిలి: మండలంలోని యరగాంలో వివిధ విభాగాల్లో రాణించే క్రీడాకారులకు తనవంతు సహకారం అందిస్తానని గ్రామ యువతకు టిడిపి యువ నాయకులు గురువు తిరుమలరావు హామీ ఇచ్చారు. ఆదివారం గ్రామానికి చెందిన యువత వాలీబాల్ క్రీడ ఆడటానికి క్రీడా పరికరాలు కావాలని ఆయనను కోరగా తక్షణమే స్పందించిన తిరుమలరావు రూ.పదివేలు ఖర్చు చేసి వాలీబాల్ క్రీడా పరికరాలతో పాటు క్రీడా ప్రాంగణాన్ని కూడా తయారు చేయించారు. క్రీడాకారులతో కలిసి ఆయన ఆడారు. చిన్నారులకు, వృద్ధులకు, క్రీడాకారులకు అవసరమైన కొన్ని సమస్యలను పరిష్కరించడానికి తనవంతు సహకారాన్ని అందిస్తానని ఆయన తెలియజేశారు.

సంక్షిప్త వార్తలు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ఆమదాలవలస: పురపాలక సంఘంలోని ఆరో వార్డు పరిధిలోని నందగిరిపేటలో ప్రముఖ వైద్యులు, లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షులు లయన్ డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పలువురికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్నది వర్షాకాలమని, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉందని, ప్రజలందరూ జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మలేరియా, డెంగీ వంటి వ్యాధులు రాకుండా తగు జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు సూచించారు. అనంతరం గ్రామంలో మొక్కలను నాటారు.

నేడు బహిరంగ వేలం

టెక్కలి రూరల్ : మండలంలోని రావివలస ఎండల మల్లిఖార్జునస్వామి ఆలయ భూములను మూడేళ్లకు కౌలు హక్కులకు సోమవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి వి.రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సర్వే నంబరు 142/6, 143/9లోని 4.99 ఎకరాల పల్లం భూమిని కౌలు హక్కుకు అధికారులు, గ్రామస్తుల సమక్షంలో బహిరంగ వేలం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రూ.30 వేలు ధరావత్తు చెల్లించి బహిరంగ వేలంలో పాల్గొనాలని కోరారు.

ప్రకాశరావుకు సన్మానం

టెక్కలి : ఇంటర్మీడియట్ విద్యాశాఖ, జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి, టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కోట ప్రకాశరావు ఆదివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ మేరకు టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆర్ఐఒ దుర్గారావు చేతుల మీదుగా ప్రకాశరావు దంపతులకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ వి.కిరణ్‌కుమారి ఆధ్వర్యాన ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశంలో విశ్రాంత ప్రిన్సిపాళ్లు పాత్రుని పాపారావు, దుంపల శ్యామలరావు, బెందాళం హరిప్రసాద్, రుక్మాంగదరావు, అధ్యాపకులు అజయ్‌కుమార్, లక్ష్మీపతి, వి.రాజశేఖర్, రవికుమార్, ముకుందరావు పాల్గొన్నారు.

చిన్నారికి ఆర్థికసాయం

సరుబుజ్జిలి: మండలం వీరభద్రాపురానికి చెందిన సనపల వెంకట రమణ కొద్దిరోజుల క్రితం అకాల మరణం చెందడంతో ఆ కుటుంబం అనాథలుగా మారారు. ఆయనకు భార్య, మూడు నెలల వయసు గల కుమార్తె ఉన్నారు. ఆ చిన్నారిని పోషించే స్తోమతలేక తల్లి విలవిల లాడుతుండడంతో గత కొన్ని రోజులుగా వార్తా పత్రికల్లో కథనాలు రావడంతో రేపటి ప్రయోజనం ఫౌండేషన్ సంస్థ గుర్తించి ఆ కుటుంబానికి తక్షణ ఆర్థికసాయంగా రూ.20 వేలు దాతల సహాయంతో ఆ కుటుంబానికి అందజేశారు. అలాగే ప్రధానమంత్రి సుకన్య సమృద్ధి యోజన పథకం కింద ప్రతి నెల కొంత మొత్తం ఆ చిన్నారి పేరున జమ చేయనున్నట్లు ఎస్ఐ బి.నిహార్ తెలిపారు. రేపటి ప్రయోజనం ఫౌండేషన్ సభ్యులు బాలు, ఈశ్వర నాయుడు, కోటేశ్వరరావు, సూర్యనారాయణ, సింహాచలం, జనార్దనరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జగన్మోహనరావు

వైద్యారోగ్యశాఖలో విలీనం చేయాలి

శ్రీకాకుళం అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా గత ప్రభుత్వం తీసుకొచ్చిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థలో పనిచేస్తున్న హెల్త్ సెక్రటరీలను వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో విలీనం చేయాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జగన్మోహనరావు, హెల్త్ సెక్రటరీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు మాధవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని ఆవోపా కళ్యాణ మండపంలో సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెల్త్ సెక్రటరీల పని భారాన్ని తగ్గించడంతో పాటు గ్రేడ్ స్థాయిని పెంచాలన్నారు. క్షేత్రస్థాయిలో సమాన హోదాలో పని చేస్తున్న పంచాయతీ సెక్రటరీల నుంచి వేదింపులకు గురవుతున్నామన్నారు. కార్యదర్శుల నుంచి వేధింపులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యఆరోగ్య శాఖలో కొత్త ప్రభుత్వం సమూల మార్పులు తేవాలని, మహిళా ఉద్యోగుల పనిపై అధికారులు నిర్లక్ష్యం కూడదన్నారు. గడచిన ఐదేళ్లగా వేతనాలు పెరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో సంఘం నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షురాలిగా ఎస్.రంగమ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా జి.ప్రభావతి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సిహెచ్ రాధిక, ట్రెజరీగా ఎ.రాజ్యం ఎన్నికయ్యారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు బి.మురళి, యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పొట్నూరు అప్పారావు పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మొక్కలతోనే మానవ మనుగడని స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ పిలుపు మేరకు తల్లికి వందనం కార్యక్రమంలో భాగంగా ఆదివారం బంటుపల్లి పంచాయతీ నడుకుదిటిపాలెంలో తన తల్లి మాజీ సర్పంచ్ మహాలక్ష్మితో కలసి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి కాలుష్యాన్ని నివరించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఎన్. రజని, మాజీ ఎంపిపి డిజిఎం ఆనందరావు, మాజీ ఎంపిటిసి గురాల రఘునాథ్, సిహెచ్‌సి మాజీ చైర్మన్ వెలిచేటి సురేష్ కుమార్, వేల్పురాయి సర్పంచ్ బాలి శ్రీను, విజెఎస్ఎల్ పి.మౌళి తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం: విచక్షణా రహితమైన మానవ కార్యకలాపాల వలన ప్రకృతి విధ్వంసం జరిగి వాతావరణం వేడెక్కుతుందని హరిత సమగ్ర గ్రామీణాభివృద్ధి సంస్థ కన్వీనర్ ఆర్.హరిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం తమ సంస్థ, పతివాడ పాలెం గ్రామస్తుల సమన్వయంతో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. సర్పంచ్ రెడ్డి విశ్వేశ్వరరావు, హరిత సొసైటీ సెక్రటరీ పి.తవిటినాయుడు, బి.జగన్నాథం, శ్రీరామమూర్తి, ఆర్.లక్ష్మణరెడ్డి, పి.వాసు, గ్రామ యువత తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్ : మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే ఎన్ఇఆర్

తాగునీరు సరఫరా

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ గొల్లవీధిలోని కిల్లిపోలమ్మ తల్లి అమ్మవారి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అదేశాలు మేరకు ఆదివారం గొల్లవీధి, రామదాసుపేట ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా ప్రజలకు తాగునీటిని సరఫరా చేశారు. ఉత్సవాల నేపథ్యంలో ఇబ్బందులు రాకుండా చూడాలని మంత్రి టిడిపి మండల పార్టీ అధ్యక్షులు బగాది శేషగిరికి బాధ్యత అప్పగించారు. కార్యక్రమంలో కోల లవకుమార్, మామిడి రాము, రెయ్య ప్రితేష్, బసవల మరళి, దోని బుజ్జి, కోనారి శ్రీను పాల్గొన్నారు.


నీటిని సరఫరా చేస్తున్న టిడిపి నాయకులు